క్లుప్తంగా

'జేసీ కోర్టుకు హాజరుకావాలి'

తగరపువలస: భీమిలి డివిజన్ కాపులుప్పాడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 328/10లోని 0.68 సెంట్లకు సంబంధించి డిసెంబర్ 2న విశాఖ జాయింట్ కలెక్టర్ కోర్టులో హాజరుకావాలని జేసీ తరఫున కె.మోహన్‌కుమార్ సూచించారు. గొలగాని అప్పయ్యమ్మ, బుద్దల అప్పలకొండ, పాసి వగలమ్మ, బుద్దరాజు సత్యనారాయణ తండ్రి సూర్యనారాయణరాజు, బుద్దరాజు ప్రదీప్ వర్మ తండ్రి సూర్యనారాయణరాజు, భీమిలి తహసీల్దార్ మధ్య గల రివిజన్ పిటీషన్ నంబరు 36/2023కు సంబంధించి ఇప్పటికే ఈ ఏడాది సెప్టెంబరు 23, అక్టోబర్ 7, 21, నవంబరు 4న ఆధారాలతో సహా హాజరు కావాలని నాలుగుసార్లు నోటీసులు జారీ చేశామన్నారు. వచ్చే నెల 2న హాజరుకాకపోతే కార్యాలయంలో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతీ సమస్యకు పరిష్కారం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు అన్నారు. కాపులుప్పాడ సచివాలయం సమీపంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, ఇంటి పట్టాల సమస్యలు, మంచినీటి సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటిని త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, ఎరుసు అప్పలకొండ రెడ్డి, దుంప సత్యం, వేముల ఈశ్వర్‌రెడ్డి, గుడ్ల కొండబాబు, బోర రాసయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరణ



సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పద్మనాభం: మండలంలోని కొత్త కొవ్వాడ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు బోని రమణమ్మ, పొన్నకాయల రమణ పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తునివలసలో శనివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం రూ.20.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, సర్పంచ్ సుంకర పైడిరాజు, ఎంపీటీసీ సభ్యుడు కిలారి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర బంగారప్పడు, అట్టాడ అప్పారావు పాల్గొన్నారు.

జీపీఎస్ జీవో రద్దుకు వినతి

పద్మనాభం: జీపీఎస్ జీవో 116ను ఉపసంహరించుకుని పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నేతలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సోమవారం సాయంత్రం కలిసి వినతిపత్రం అందించారు. అలాగే నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం వల్ల గ్రేడ్ – 2 హెచ్‌ఎం పోస్టులు కోల్పోతున్నందున విలీనానికి సంబంధించి 117 ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.

శ్రీవారి సన్నిధిలో క్రీడాకారులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈవో రామావతార్ జాకర్, విజయనగరం జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షుడు సూరిబాబు, క్రీడాకారులు సోమవారం స్వామిని దర్శించుకున్నారు. వీరు నగరంలో ఇంటర్ సర్కిల్ ఎస్‌బీఐ టోర్నమెంట్‌లో పాల్గొని, అనంతరం శ్రీవారిని దర్శించుకున్నట్లు తెలిపారు.

కుట్టు మిషన్ల పంపిణీ

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పేదలకు చేయూత అందించడం గొప్ప విషయమన్నారు. అనంతరం పేద మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, కె.ఎస్.ఎన్.మూర్తి, భానోజీరావు పాల్గొన్నారు.

సర్కారీ వైద్యం సూపర్

- పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల రూపురేఖలు మార్చేసిన సీఎం జగన్
- 'నాడు – నేడు'లో ఆధునిక పరికరాలు సమకూర్చిన ప్రభుత్వం
- పేదల ముంగిటకే నిపుణులతో వైద్యం, నాణ్యమైన మందులు





ఆధునీకరించిన తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వైద్యో నారాయణో హరి నానుడిని నిజం చేస్తూ వైద్యో నారాయణో జగన్ అన్నంతగా ప్రభుత్వ ఆస్పత్రుల రూపు రేఖలను గడిచిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చేశారు. పేదల ఇంటి ముంగిటకే అందుతున్న నాణ్యమైన వైద్య సేవలే ఇందుకు నిదర్శనం. కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, నాణ్యమైన మందులు అందుబాటులో ఉండడంతో సామాన్యులంతా ఆధునిక దేవాలయాలుగా పిలుచుకునే ప్రభుత్వ వైద్యశాలలనే ఆశ్రయిస్తున్నారు. అప్పటికే ఉన్న ఆస్పత్రుల్లో 'నాడు – నేడు' ద్వారా వసతులు కల్పించి ఆధునికీకరించడమే కాకుండా కొత్తగా వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. ప్రస్తుతం ముట్టుకుంటే మాసిపోతాయేమోనన్న రీతిలో ఆస్పత్రులను స్వచ్ఛంగా నిర్వహిస్తున్నారంటే ప్రజా వైద్యానికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యమిస్తోందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఆరోగ్యశ్రీని విస్తరించి అందిస్తున్న వైద్య సేవలు, సీఎం సహాయ నిధితో సాయం కలిపి పేదలపై ఆర్థిక భారం తగ్గించాయనడంలో సందేహం లేదు. – తగరపువలస



మద్ది గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్

గతంలో మండలానికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నియోజకవర్గానికి ఒక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ మాత్రమే ఉండేవి. ఇక్కడ వసతులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలంతా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించి వైద్యం కోసం జేబులు గుల్ల చేసుకుని ఆస్తులు అమ్ముకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలానికి అదనంగా మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు జీవీఎంసీ పరిధిలోని వార్డుల్లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించి వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిని నియమించింది. మరోవైపు గ్రామీణుల కోసం ప్రతీ పంచాయతీలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి ఫ్యామిలీ ఫిజీషియన్ పేరుతో నెలలో రెండుసార్లు వైద్యులు, రోజూ ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించడానికి కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించి ఖరీదైన వైద్యం అందిస్తున్నారు.

కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలలోపు వుండేవారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా దేశంలో ఎక్కడైనా వైద్యసేవలు ఉచితంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంతేకాకుండా నిర్ణీత తేదీల్లో ప్రత్యేక వైద్యసేవలు అందించేందుకు నిపుణులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్కారీ ఆస్పత్రులు దోమలు, పందికొక్కులు, ఎలుకలకు ఆవాసంగా ఉండేవి. ఆస్పత్రుల పరిసరాలు కంపుగొడుతూ రోగులు సైతం అడుగు పెట్టలేని విధంగా దెయ్యాల కొంపలుగా ఉండేవి. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పూర్తిగా మార్పు వచ్చింది. దీర్ఘకాలిక రోగుల ఇంటికే వైద్యులు వెళ్లి తనిఖీ చేసి మందులు అందిస్తున్నారు. పీహెచ్‌సీల పరిధిలో 104, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పరిధిలో 108 వాహనాలను సిబ్బందితోపాటు అందుబాటులో ఉంచడంతో అందరికీ ప్రయోజనకరంగా వుంటోంది. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో నిత్యం బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సిన్లు, ప్రసవాలు, సిజేరియన్, కాన్పు చేయించుకున్నవారికి వైఎస్సార్ బేబీ కిట్ అందిస్తున్నారు. బాలింతలను సురక్షితంగా ఇంటికి చేర్చడానికి తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్, కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, లెప్రసీ, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, హెచ్‌ఐవీపై అవగాహన, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలకు రూ.1000 బహుమతి, సంక్షేమ శస్త్ర చికిత్స చేసుకున్న మహిళలకు రూ.600, పురుషులకు రూ.1100 ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

నియోజకవర్గంలో ఆస్పత్రులు అభివృద్ధి చేశారిలా...

రూ. 8.21 కోట్లు

ఎనిమిది పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (చేపలుప్పాడ, కొమ్మాది, పీఎం పాలెం, స్వతంత్రనగర్, వాంబే కాలనీ, మారికవలస, రుషికొండ, మిథిలాపురి వుడా కాలనీ) నిర్మించారు.

రూ.30 లక్షలు

3 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (తగరపువలస, భీమిలి, సాగర్‌నగర్) ఆధునికీకరించారు.

రూ.2.68 కోట్లు

4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (తాళ్లవలస, రేవిడి, మధురవాడ, ఆనందపురం) ఆధునికీకరించారు.

రూ.3.60 కోట్లు

భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆధునిక వసతులు, వైద్య పరికరాలు సమకూర్చారు.

36 భీమిలి నియోజకవర్గంలో నిర్మించిన హెల్త్ క్లినిక్‌లు

ఒక్క పీహెచ్‌సీ స్థానంలో 6 యూపీహెచ్‌సీలు

ఒక్కొక్కటి రూ.80 లక్షలతో నిర్మాణం

మధురవాడ: వైద్య రంగానికి గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వనంత ప్రాధాన్యం ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇస్తున్నారు. ఒక్క పీహెచ్‌సీ స్థానంలో ఆరు యూపీహెచ్‌సీలు నిర్మించారంటే ఎంత ప్రాధాన్యమిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గతంలో బోయిపాలెం సమీపంలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పీపీ – 2 కాలనీ నుంచి ఎండాడ వరకు... ఇటు సాగరతీరంలోని గొల్లల తిమ్మాపురం నుంచి శంభువానిపాలెం మధ్య నివసిస్తున్న సుమారు లక్షన్నర జనాభాకి ఒక్క మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారానే వైద్య సేవలు అందించేవారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిధులు కేటాయించడంతో ఒక్కొక్కటి రూ.80 లక్షలతో ఆరుచోట్ల మారికవలస (ఆర్‌జీకే కాలనీ), బక్కన్నపాలెం (కొమ్మాది అమరావతినగర్), పీఎం పాలెం (అవంతి ఫంక్షన్ హాలు), స్వతంత్రనగర్ (గణేష్‌నగర్), వాంబేకాలనీ, మిథిలాపురి వుడా కాలనీ యూపీహెచ్‌సీలు నిర్మించారు. ఈ ఆస్పత్రుల్లో 56 రకాల వైద్య పరీక్షలు, 150 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. సెమీ ఆటో బయో కెమిస్ట్రీ ఎన్‌లైజర్, యూరిన్ ఎన్‌లైజర్, ఎలక్ట్రోలైట్ ఎన్‌లైజర్, సెంట్రీఫ్యూగ్, మైక్రో స్కోపు, బయోమిక్సర్, సీబీసీ సెల్ కౌంట్ వంటి ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులైన వైద్యులు నిత్యం అందుబాటులో వుంటున్నారు.



మారికవలస ఆర్‌జీకే కాలనీలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పరిశుభ్రంగా ఆస్పత్రులు



తాళ్లవలస పీహెచ్‌సీలో నాకు సాధారణ ప్రసవం జరిగింది. వైద్యసేవలు, ఆస్పత్రుల పరిసరాలు బాగున్నాయి. రోగులతో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరిస్తున్నారు.

– చిల్ల ధనలక్ష్మి, తాటితూరు

అందుబాటులో వైద్యసేవలు



ఎప్పుడు అవసరమని ఆస్పత్రికి వచ్చినా వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. అన్నిరకాల వ్యాక్సిన్లు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచుతున్నారు.

– నక్కెళ్ల గంగరాజు, గొల్లల తాళ్లవలస



వుడా కాలనీ యూపీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

చంద్రబాబు హయాంలో మహిళలకు అన్యాయం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: చంద్రబాబు హయాంలో మహిళలకు సున్నా వడ్డీ, రుణమాఫీ తదితర మోసపూరిత హామీలు ఇచ్చి అన్యాయం చేశారు తప్ప మేలు చేసింది శూన్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం వైఎస్సార్ సీపీ భీమిలి పరిశీలకుడు, మాజీ మంత్రి పి.బాలరాజుతో కలిసి జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్టపై సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు స్థానికులతో మాట్లాడుతూ పరిశుద్ధమైన, సరిపడినంత తాగునీటి సరఫరా కోసం మంగళవారం భీమిలి జోనల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నామన్నారు. కల్యాణమండపం, జగనన్న ఇళ్ల సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకురాగా వాటిపై కూడా అధికారులతో చర్చించి న్యాయం చేస్తామన్నారు. అధికారులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది నిత్యం తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్య పనులపై ఆరా తీసి సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. ప్రజలకు అండగా నిలబడే గొప్ప నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ హయాంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, నాయకులు వెంపాడ వెంకటరమణ, పందిరి విజయ్, జీవీ రమణ, చిల్ల బాబయ్యరెడ్డి, చింతగుంట శివ, తమ్మిన నరసింగరావు, కుమిలి సూర్యనారాయణ, గంట్రేటి ఈశ్వరరావు, శిల్లా వంశీ, జీరు శ్రీనివాసరెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, దుంప సాయిరెడ్డి పాల్గొన్నారు.



బంగ్లామెట్టపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

న్యాక్ బృందం పర్యటన నేడు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ (ఎన్‌ఏఏసీ, న్యాక్) బృందం మంగళవారం, బుధవారం పరిశీలించనుంది. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు అధ్యాపకులు చేశారు. బృందం పరిశీలన అనంతరం గ్రేడింగ్‌ను నిర్ణయిస్తారు. గత సారి కళాశాల బీ గ్రేడ్‌ను సాధించగా ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో కళాశాల భవనాన్ని నిర్మించారు. ఈ సారి 'ఏ' గ్రేడ్ సాధించాలన్న పట్టుదలతో ఉండగా ఆ అర్హత సాధించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పద్మనాభం: వైఎస్సార్ సీపీ నాయకులు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, తాలాడ పద్మనాభం దంపతుల కుమార్తె తాలాడ శైవలి జయంతి సందర్భంగా సోమవారం 150 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. 100 మంది గ్రామస్తులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. వీటిని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు అందించారు.

పార్కు పరిరక్షణకు చర్యలు చేపట్టండి

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు హిందుస్థాన్ షిప్‌యార్డు లే అవుట్ బింద్రానగర్‌లో పార్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని బింద్రానగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా బింద్రానగర్ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎమ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఈ.శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులు రమేష్‌బాబు, మైఖేల్ తదితరులు మాట్లాడారు. జీవీఎంసీ 6వ వార్డు హెచ్‌పీసీఎల్ లే అవుట్‌లో వీధిలైట్లు వెలగడం లేదని, 8వ వార్డు వివేకానంద నగర్‌లో రోడ్డు ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు చేశారు. మొత్తంగా 9 అర్జీలు వచ్చాయని, పరిశీలించి చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందనకు డిపార్ట్‌మెంట్ హెడ్‌లు డుమ్మా కొట్టారు. స్పందనకు రాని వారిపై చర్యలు చేపడతామని జెడ్సీ చెప్పారు.

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు అయిదు వినతులు వచ్చాయి. ప్రజారోగ్య విభాగానికి మూడు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగానికి ఒక్కొక్క వినతి వచ్చింది.

'భీమిలి వైభవం' ఆవిష్కరణ

భీమునిపట్నం: ప్రవచన కర్త, కవి రామకృష్ణానంద రచించిన భీమిలి వైభవం పద్యకావ్యం పుస్తకం సోమవారం ఆవిష్కరించారు. పౌరాణిక ఇతిహాస్యం, భీమిలి చరిత్ర, నర్సింహస్వామి క్షేత్ర మహిమ మొదలైన అంశాలు ఈ పుస్తకంలో పొందుపరిచారు. పుస్తకంతోపాటు సంబంధిత ఆడియోను సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ అధ్యక్షులు కోట మల్లిఖార్జునరావు, రాష్ట్ర అర్చక సంఘ సమాఖ్య ఉపాధ్యక్షులు ఆర్.సింగరాచార్యులు ఆవిష్కరించారు. స్వామి మైత్రేయ, గౌరీశంకర శాస్త్రి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఆలయాల్లో మార్మోగిన శివ నామస్మరణ



దీపోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బ్రహ్మకుమారీలు



మిథిలాపురి వుడా కాలనీలో రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



మహా కామేశ్వర స్వామి

తగరపువలస: కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని భీమిలి పరిధిలో శివాలయాలు శివ పంచాక్షరి నామంతో మార్మోగాయి. వేకువ జాము నుంచే భక్తులు క్యూ లైన్ల ద్వారా మహాదేవుని దర్శించుకుని అభిషేకాలు చేశారు. కొన్నిచోట్ల మహా రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

కార్తీక లక్ష దీపోత్సవం ప్రారంభం

జీవీఎంసీ ఒకటో వార్డు గోస్తనీనది తీరాన బంగ్లామెట్ట వద్ద ప్రజాపిత బ్రహ్మకుమారీలచే ఏర్పాటు చేసిన కార్తీక లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు ఈశ్వరతత్వం గురించి వివరించారు. తొలిరోజు బిల్వార్చన నిర్వహించారు. 21న కుంకుమార్చన, 22న పుష్పార్చన, 23న ఏకాదశి, రుద్ర యజ్ఞం, 24న విభూతి అర్చన, 25న తులసి అర్చన, చివరి రోజైన 26న పుష్పార్చన, హోమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు వేణు, నిర్మల, ధనలక్ష్మి, సునీత, సంధ్య, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా స్థానిక శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం మూడు గంటల నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని శివయ్యకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు.

పీఎం పాలెం : బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువు తీరిన శ్రీ ఉమా సిద్దేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేశారు. ఆఖరు బస్టాపునకు సమీపంలోని ఎండల మల్లేశ్వర స్వామి ఆలయంలో 108 శివలింగాలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు.

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో దేవదాయ శాఖ ఈవో బుద్ధ లక్ష్మీ నగేష్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు దొంతుకుర్తి సుబ్రహ్మణ్య శర్మ పూజలు నిర్వహించారు. ఐటీ సెజ్ జంక్షన్ వద్ద మానం ఆంజనేయులు నగర్ శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ప్రతాపరాజు, జేడీ నాయుడు, కార్యదర్శి అప్పారావు ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. మధురవాడ జంక్షన్‌లోని సిద్దేశ్వర స్వామి పీఠంలో ప్రత్యేక పూజలు చేశారు.

కొమ్మాది: బీచ్ రోడ్డు హంసవనం పుణ్యక్షేత్రం రామాద్రిలో, ఎండాడ, రుషికొండ శివాలయాల్లో, మారికవలస శివాలయాల్లో శివునికి భక్తులు పంచామృతాభిషేకాలు నిర్వహించి దీపారాధన చేశారు.



కాశీ ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో భక్తులు



రామాద్రిలో శివయ్య

హార్బర్ అగ్నిప్రమాదంలో భీమిలి బోట్లు

తగరపువలస: ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో భీమిలి మత్స్యకారులకు చెందిన 14 బోట్లు దెబ్బతిన్నాయి. మైలపల్లి లక్ష్మయ్య, గరికిన దానయ్యమ్మ, వంక గురుమూర్తి, మైలపల్లి చిన్నయ్య, వాసుపల్లి అప్పన్న, ఫిరాది దుర్గాప్రసాద్, కోనాడ అమ్మాజీల బోట్లు పూర్తిగా కాలిపోగా బడే అప్పన్న, ఉమ్మిడి ఎర్రయ్యకు చెందిన బోట్లు, వలలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పెదనాగమయ్యపాలెంకు చెందిన గరికిన అప్పయ్యతాత, గరికిన కొండ, చిననాగమయ్యపాలేనికి చెందిన వాసుపల్లి నాని, భీమిలి ఎగువపేటకు చెందిన కారి రాము, చేపలుప్పాడకు చెందిన వాసుపల్లి పెంటారావు బోట్లు ప్రమాదానికి గురయ్యాయి. వీటి నష్టం రూ.3 కోట్ల వరకు ఉంటుందని అంచనా. భోగాపురం మండలానికి చెందిన వారి బోట్లు 20 ప్రమాదానికి గురయ్యాయి.

విజ్ఞాన సముపార్జనకు గ్రంథ పఠనం దోహదం

ఆనందపురం : విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథ పఠనం ఎంతో దోహదపడుతుందని ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి చెప్పారు. ఆనందపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక మంచి పుస్తకం పది మంది స్నేహితులతో సమానమన్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

అనంతరం వారం రోజులపాటు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. లైబ్రేరియన్ బీఏఎస్ అప్పారావు, ఉప సర్పంచ్ బంటుబిల్లి రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఏవీ శ్రీరామమూర్తి, పోస్టుమాస్టర్ హరికృష్ణ, చందక అప్పలనాయుడు, కొట్యాడ రెడ్డిబాబు, సత్యమూర్తి, ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

తీరంలో ఈదురు గాలులు

కొమ్మాది: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన నేపథ్యంలో భీమిలి బీచ్ రోడ్డు తీర ప్రాంతాల్లో ఒక్కసారిగా సోమవారం ఈదురుగాలులతో తేలికపాటి వర్షం కురిసింది. మంగమారిపేట, చేపలుప్పాడ, రుషికొండ తీర ప్రాంతాల్లో ఉన్న పడవలు, వలలను మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



మంగమారిపేట బీచ్ వద్ద ఎగసిపడుతున్న కెరటాలు